నేడు కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికలు

మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య వెల్లడి

స్టేషన్ ఘన్‌పూర్, ఫిబ్రవరి 24 : స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల ముఖ్య నాయకులు మంగళవారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో పెద్ద ఎత్తున బీఆర్ఎస్‌లో చేరుతున్నారని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ధర్మసాగర్ మండల మాజీ జడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డితోపాటు అనేక మంది బీఆర్ఎస్‌లో చేరుతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హాజరవుతారని వెల్లడించారు. నియోజకవర్గంలోని మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు తరలిరావాలని ఆయన కోరారు.

సిద్ధేశ్వరాలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

బచ్చన్నపేట, ఫిబ్రవరి 24: మండలంలోని కొడవటూర్ సిద్ధేశ్వరాలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు జరిగే ఉత్సవాలను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఆలయ ప్రధాన పూజారి ఓంనమఃశివాయ ఆధ్వర్యంలో అర్చకులు ఆలయ సమీపంలోని మహిమాన్విత జలం కలిగిన బావి వద్ద గంగపూజ చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ప్రధానార్చకుడి ఇంటి నుంచి పూర్ణకలశం తీసుకొచ్చి గంగా జలంతో స్వామి వారి వద్దకు తరలివెళ్లారు. అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, ఆలయ కమిటీ చైర్మన్ ఆముదాల మల్లారెడ్డి, ఈవో చిందం వంశీ, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్చకులు పూజలు చేశారు. డీపీవో స్వరూపారాణి మాట్లాడుతూ ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. తాగునీరు వీధిదీపాల నిర్వహణ మెరుగు పర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ డైరెక్టర్లు నిమ్మ కరుణాకర్‌రెడ్డి, నరేళ్ల రాజయ్య, వెంకటయ్య, రామకృష్ణ, ఈర్ల శివరాములు, అర్చకులు సదాశివుడు, మహాశివుడు, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి 12 ఫ్యాన్లు అందజేత

బచ్చన్నపేట మండలంలోని కొడవటూరు సిద్ధేశ్వరస్వామి ఆలయానికి జనగామ మండలం పెద్దపహాడ్‌కు చెందిన ఈదులకంటి ఐలయ్య 12 ఫ్యాన్లు బహుకరించారు. వీటిని ఆలయ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి, ఈవో వంశీ, ఆలయ ప్రధాన పూజారి ఓంనమఃశివాయకు సోమవారం అందించారు. ఈ సందర్భంగా ఐలయ్యను ఆలయ పాలకవర్గం అభినందించింది.

పెద్దబాయితండా గ్రామ కార్యదర్శి సస్పెన్షన్

కొడకండ్ల, ఫిబ్రవరి 24 : మండలంలోని పెద్దబాయి తండా గ్రామపంచాయతీ కార్యదర్శి సోమేశ్వర్‌ను సస్పెండ్ చేస్తూ సోమవారం రాత్రి జిల్లా కలెక్టర్ షేక్‌రిజ్వాన్‌బాషా ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామపంచాయతీలో నిధుల దుర్వినియోగంపై ఆరోపణలు వెలువడిన నేపథ్యంలో కార్యదర్శిని, స్పెషల్ ఆఫీసర్‌ను బదిలీ చేయాలని కోరుతూ ఇటీవల మాజీ ప్రతినిధులతోపాటు స్థానికులు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. దీనిపై విచారణ జరిపిన డీపీవో కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. నివేదికను పరిశీలించిన కలెక్టర్ పంచాయతీ కార్యదర్శి సోమేశ్వర్‌ను సస్పెండ్ చేశారు. ప్రత్యేక అధికారులుగా ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కే భవాని, ఎంపీడీవో నాగశేషాద్రిసూరి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహేందర్ పర్యవేక్షణ లోపంపై హెచ్చరిస్తూ కలెక్టర్ వీరికి మెమోలు జారీ చేశారు.

వ్యాధుల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి

మాట్లాడుతున్న డాక్టర్ మల్లికార్జున్‌రావు

కొడకండ్ల, ఫిబ్రవరి 24 : వీధి కుక్కల పట్ల అప్రమత్తంగా ఉంటూనే వాటి ద్వారా వ్యాపించే వ్యాధులకు నివారణ చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌వో డాక్టర్ మల్లికార్జున్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని ఏడునూతులలో వీధి కుక్కల ద్వారా ప్రజలకు వ్యాధులు వ్యాపిస్తున్నాయని ప్రజలు చెప్పడంతో గ్రామ పంచాయతీ వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించారు. వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మల్లికార్జున్‌రావు ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి హరికృష్ణారెడ్డి, సుధీర్, కమ్యూనిటీ హెల్త్ అధికారులు రమేష్, హెచ్ దయాకర్, గ్రామపంచాయతీ కార్యదర్శి ఉపేందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈరెంటి సాయికృష్ణ, కాగితం యాకన్న పాల్గొన్నారు.

ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 24 : ధరణి పోర్టల్‌లోని పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్‌తో కలిసి ధరణి పెండింగ్ దరఖాస్తులపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తులలోని వివిధ మాడ్యుల్స్‌లలో ఉన్న అంశాలపై రోజు వారీగా నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవో గోపీరాం, తహసీల్దార్లు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★ లేడీ టెలికాలర్స్, బ్యాగ్‌రౌండ్ పెయింటర్స్, కార్టూన్స్ వేసే ఆర్టిస్టులు వెంటనే కావలెను. సంప్రదించండి: 8074288199, హైదరాబాద్.
NT-329857

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

ఆలయానికి రూ.50,116 విరాళం

నర్మెట, ఫిబ్రవరి 24 : మండల కేంద్రంలోని దుర్గామాత ఆలయ అభివృద్ధికి పద్మశాలీ సంఘం తరపున రూ. 50,116 విరాళాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు బుస్స అంజయ్యకు అందించారు. ఈ మేరకు పద్మశాలి సంఘం నేత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చింతకింది సురేశ్ విరాళాన్ని సోమవారం అందించారు. దాతలు విరాళాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ గౌరవాధ్యక్షుడు జంగిటి అంజయ్య, కోశాధికారి మలిపెద్ది స్వామి, సలహాదారుడు ఆనందాసు నాగరాజు, బండి రాజు, బిజ్జ సత్యనారాయణ, కందకట్ల నాగభూషణం, శ్రీనివాస్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పలువురి పరామర్శ

చిల్పూరు, ఫిబ్రవరి 24 : మండలంలోని మల్కాపూర్‌కు చెందిన పద్మశాలి సంఘం మండల నాయకుడు కుసుమ రాజమౌళి (ఎల్‌ఐసీ) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గజ్జల దామోదర్ మల్కాపూర్‌లో మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన వారిలో నాయకులు బండారి రాజ్‌కుమార్, పేరాల కుమారస్వామి, కుసుమ రమేశ్, వెంకటరాజం, అంకం రాజేశ్వర్, బల్లె ఋషి, రమేశ్, రాజేశ్వర్ ఉన్నారు.

దేవరుప్పులలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

బెయిల్‌పై విడుదలైన తీగల దయాకర్, యాకయ్యతో నాయకులు

బీఆర్ఎస్ గొంతు నొక్కేందుకే తప్పుడు కేసులు

- స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెబుతాం
- బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో నాయకుడు పల్లా సుందరరాంరెడ్డి

దేవరుప్పుల, ఫిబ్రవరి 24: మండలంలో ప్రతిపక్షం బలంగా ఉండడంతో ఓర్వలేకపోతున్న కాంగ్రెస్ నాయకులు అక్రమ కేసులు బనాయిస్తూ నీచపు రాజకీయాలు చేస్తున్నారని బీఆర్ఎస్ మండల నాయకుడు పల్లా సుందరరాంరెడ్డి మండిపడ్డారు. బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తీగల దయాకర్, మరో నాయకుడు గొడిశాల యాకయ్యపై పోలీసులు తప్పుడు కేసులు పెట్టి సోమవారం పోలీస్‌స్టేషన్‌కు తరలించగా వారికి బీఆర్ఎస్ శ్రేణులు సంఘీభావం తెలిపాయి. ఈ సందర్భంగా పల్లా సుందరరాంరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జినని చెప్పుకునే ఝాన్సీరెడ్డికి మండలంలో బలంగా ఉన్న బీఆర్ఎస్ పార్టీని చూసి మింగుడుపడడంలేదన్నారు. తమ పార్టీ శ్రేణులకు భయభ్రాంతులకు గురి చేసేందుకు పోలీసులను అడ్డుపెట్టుకుని అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆయన విమర్శించారు. ఎన్ని కేసులు పెట్టి జైలుకు పంపితే ఝాన్సీరెడ్డి తృప్తి పడుతుందో తెలియజేస్తే తామే స్వచ్ఛందంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి కేసులు పెట్టమని పోలీసులను అడుగుతామని అన్నారు. కొంత మంది అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ తమపై కేసులు పెట్టాలనే ఆలోచనలో ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో చినమడూరులో వంగ అర్జున్, మల్లికార్జున్‌పై కేసులు పెట్టి జైలుకు పంపారని, మరో యూట్యూబ్ రిపోర్టర్‌ను 14 రోజులు జైలుకు పంపారని గుర్తు చేశారు. అక్రమ కేసులకు బీఆర్ఎస్ నాయకులు భయపడరని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బస్వ మల్లేశ్, ఏల సుందర్, కొల్లూరు సోమయ్య, జోగు సోమనర్సయ్య, సత్తయ్య, శ్రీనివాసరెడ్డి, గొడిశాల దశరథ, కృష్ణమూర్తి, జేరిపోతుల సాయిలు, గేమానాయక్, చంద్రమౌళి, తాటిపల్లి మహేశ్, లొడంగి వెంకన్న, నవీన్‌నాయక్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులకు బెయిల్ మంజూరు

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్‌తోపాటు మరో నాయకుడు గొడిశాల యాకయ్యపై పోలీసులు తప్పుడు కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా బెయిల్ మంజూరైంది. ఇసుక రవాణాకు అనుమతులున్నా వీరు అడ్డుకున్నారనే నెపంతో గత గురువారం తీగల దయాకర్, గొడిశాల యాకయ్యపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో వీరిని సోమవారం జనగామలోని కోర్టులో హాజరుపర్చగా, విచారణ జరిపిన న్యాయమూర్తి బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని బీఆర్ఎస్ మండల నాయకులు పల్లా సుందరరాంరెడ్డి విలేకరులకు తెలిపారు. తమకు ఏమాత్రం సంబంధం లేని కేసులు నమోదు చేసి జైలు పాల్జేయాలన్న కాంగ్రెస్ నాయకులకు కోర్టు ఇచ్చిన తీర్పు చెంపపెట్టని ఆయన స్పష్టం చేశారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 24 : న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వచ్చే నెల 8వ తేదీన జనగామ కోర్టులో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సీ విక్రమ్ అన్నారు. సోమవారం జిల్లా కోర్టులో వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. విక్రమ్ మాట్లాడుతూ జిల్లాలోని పోలీస్ స్టేషన్‌ల వారీగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. కక్షిదారులు తమ కేసులను రాజీ చేసుకోవడం వల్ల సమయం, డబ్బు ఆదాతో పాటు మానసిక ప్రశాంతత ఉంటుందన్నారు. సివిల్, క్రిమినల్, యాక్సిడెంట్స్, చెక్ బౌన్స్, పిటీ కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి సుచరిత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శశి, జిల్లా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చంద్ర రుషి పాల్గొన్నారు.

అధిక ధరకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు

ఎరువుల షాపుల తనిఖీలో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామలోని ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 24 : రైతులకు అధిక ధరకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా హెచ్చరించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కావేరి, సాయిరాం ఫర్టిలైజర్ షాపులతో పాటు జేకేఎస్ అగ్రిమాల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. యూరియాతో పాటు ఇతర ఎరువుల స్టాక్ వివరాలు, రైతులు కొనుగోలు చేసిన ఎరువుల రిజిస్టర్లను పరిశీలించారు. కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ రైతులకు కల్తీ విత్తనాలు, ఎరువులు విక్రయించొద్దన్నారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు తప్పని సరిగా రశీదు ఇవ్వాలని ఆదేశించారు. కనీస మద్దతు ధరకే విత్తనాలు, ఎరువులు విక్రయించాలని తెలిపారు. స్టాక్ నిల్వలకు సంబంధించిన వివరాలను సూచిక బోర్డులపై ప్రదర్శించాలని ఆయన ఆదేశించారు. సాయిరాం ఫర్టిలైజర్ షాపులో స్టాక్ బోర్డు లేనందున సంబంధిత షాపు యజమానిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసి జరిమానా విధించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామారావు నాయక్‌ను ఆదేశించారు. ఈ తనిఖీల్లో వ్యవసాయశాఖ ఏడీ బీనా, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న కాంగ్రెస్ సర్కారు

సమావేశంలో మాట్లాడుతున్న కొమురయ్య

రఘునాథపల్లి, ఫిబ్రవరి 24: భవన నిర్మాణ కార్మికుల హక్కులను రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాస్తున్నదని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి రాసమల్ల కొమురయ్య ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం జరిగింది. కొమురయ్య మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు అందాల్సిన సంక్షేమ పథకాలను వర్తింప చేయకుండా లేబ ర్ ఆఫీస్‌లో సైట్ రాకుండా కుట్రలు చేస్తున్నదన్నారు. హక్కుల సాధన కోసం గత నెల 31న హైదరాబాదులోని అంజయ్య భవనం వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేశామని గుర్తు చేశారు. సైట్ ఓపెన్ అయ్యేలా 20రోజుల్లో చర్యలు తీసుకుంటామని చెప్పిన ప్రభుత్వం ఆచరణలో విఫలమైందన్నారు. లేబర్ వెల్ఫేర్ బోర్డుకు మంత్రిని నియమించి కార్మికుల న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చాలని కొమురయ్య డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగిల్ల రాజు, బద్దింటి బాబు, కడారి కుమార్, అంజనేయులు, రవి, మహేందర్ పాల్గొన్నారు.

యాసంగి పంటలకు సాగునీరందించాలి

దేవరుప్పుల, ఫిబ్రవరి 24: యాసంగి పంటలకు సాగునీరు అందించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి అధికారులను ఆదేశించారు. మరోవైపు రైతులకు యూరియా కొరత రాకుండా వ్యవసాయ శాఖ అధికారులు ఫర్టిలైజర్ షాపుల్లో ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. సోమవారం ఆమె సాగునీరు, వ్యవసాయ శాఖల అధికారులతో ఫోన్లో మాట్లాడారు. నవాబుపేటలోని దేవాదుల రిజర్వాయర్‌కు నీరు చేరేలా శ్రీమన్నారాయణపు రం వద్ద కాలువ క్లీనింగ్ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ఫాదర్ కొలంబో సేవలు చిరస్మరణీయం

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 24 : ఫాదర్ కొలంబో సమాజానికి అందించిన సేవలు చిరస్మరణీయమని ఏపీపీసీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ టీ శ్రీనివాస్‌రఘు అన్నారు. సోమవారం డివిజన్ కేంద్రంలో హస్తకళల అభివృద్ధి కమిషనర్, న్యూఢిల్లీ వారి సహకారంతో బొబిన్ లేస్ ఆర్టిసన్స్‌కు ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. స్కూల్‌నెట్ జాతీయ సలహాదారు హెచ్‌కే చారి మాట్లాడుతూ మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి చేయాలని సూచించారు. ఇందుకు తాము అన్నివిధాలుగా సహకరిస్తామని చారి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పీడీ సుధీర్‌కుమార్, విజయ్‌సాగర్‌రెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇప్పగూడెంలో పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

విద్యాబుద్ధులు నేర్పిన గురువులతో పూర్వ విద్యార్థులు

స్టేషన్ ఘన్‌పూర్, ఫిబ్రవరి 24 : మండలంలోని ఇప్పగూడెం జడ్పీ హైస్కూల్‌లో 1991– 1992లో పదో తరగతి చదవిన పూర్వ విద్యార్థులు సోమవారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఇదే పాఠశాలలో 6 నుంచి పదో తరగతి వరకు చదువుకున్న విద్యార్థులు 33 ఏళ్ల అనంతరం ఒక చోట కలుసుకుని సమావేశం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పట్టువస్త్రాలతో సత్కరించి పాదాభివందనం చేశారు. వేర్వేరు కారణాలతో మృతి చెందిన తోటి మిత్రుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించారు. అందరూ కలుసుకునే కృషి చేసిన దారణ శ్రీధర్, ఆకుల శ్రీనివాస్, నరోత్తమ్‌రెడ్డిని తోటి విద్యార్థులు, గురువులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పోకల జయప్రకాశ్, వెంకన్న, ఆంజనేయులు, ఈగ శ్రీధర్, రొండ్ల రాజు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్‌రిజ్వాన్‌బాషా

బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షేక్‌రిజ్వాన్ బాషా

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 24 : వరంగల్–నల్లగొండ–ఖమ్మం ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి జరిగే ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్‌తో కలిసి పీవోలు, ఏపీవోలు, ఓపీవోలకు రెండో విడుత శిక్షణ శిబిరం నిర్వహించారు. షేక్‌రిజ్వాన్‌బాషా మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీన ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరుగుతుందని తెలిపారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 12 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, 1002 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకుంటారని తెలిపారు. సమయం దాటిన తర్వాత పోలింగ్ కేంద్రం పరిధిలో క్యూ లైన్‌లో ఉన్న ఓటర్లకు టోకెన్ నంబర్లు అందించి ఓటు వేసే అకాశం కల్పిస్తామన్నారు. ఎన్నికల సంఘం గుర్తించిన 14 రకాల గుర్తింపు కార్డులలో ఏదైనా ఒక దానిని ఓటరు తమ వెంట పోలింగ్ కేంద్రం లోపలికి తీసుకెళ్లాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో కరెంట్, తాగునీరు, మూత్రశాలలతో పాటు ఇతర వసతులు కల్పించాలని అధికారులను షేక్‌రిజ్వాన్‌బాషా ఆదేశించారు. బ్యాలెట్ పేపర్ జారీ చేసిన తర్వాత కౌంటర్ ఫైల్‌పై ఓటరు సంతకం తీసుకోవాలని సూచించారు. పురుష, మహిళా ఓటర్ల సంఖ్యను నమోదు చేయాలని తెలిపారు. ఓటు హక్కును వినియోగించుకునే సమయంలో పోలింగ్ సిబ్బంది ఇచ్చిన వాయిలెట్ రంగు పెన్నుతో బ్యాలెట్ పేపర్‌లో పోటీలో ఉన్న అభ్యర్థులకు ఎదురుగా క్రమ సంఖ్య వేయాలని సూచించారు.

వెబ్‌క్యాస్టింగ్ ద్వారా పోలింగ్ పర్యవేక్షణ

వెబ్ క్యాస్టింగ్ ద్వారా ప్రతి పోలింగ్ కేంద్రాన్ని పర్యవేక్షిస్తామని కలెక్టర్ షేక్‌రిజ్వాన్‌బాషా పేర్కొన్నారు. ఫారం16, పేపర్ సీల్ అకౌంట్‌ను జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. ఓటరుకు ఎడమ చేతి చూపుడు వేలుకు ఇండిబుల్ ఇంకు పెట్టాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకెళ్లడానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. ఫారం 10 ద్వారా పోలింగ్ ఏజెంట్లను పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించాలన్నారు. అదేవిధంగా ఎన్నికల నిర్వహణ కోసం జిల్లాలో మూడు మండలాలకు ఒక రూట్ చొప్పున మొత్తం నాలుగు రూట్లను ఏర్పాటు చేసి, నలుగురు సెక్టోరియల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణ కోసం జిల్లాలో 17 మంది పీవోలు, 18 మంది ఓపీవోలు, 37 మంది ఓపీవోలను నియమించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనగామ ఆర్డీవో గోపీరాం, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీకాంత్, కలెక్టరేట్ ఏవో మన్సూరి, సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి వేడుకలకు కలెక్టర్‌కు ఆహ్వానం

ఈ నెల 26 నుంచి పాలకుర్తిలో జరిగే సోమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు ముఖ్య అతిథిగా కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషాను ఆలయ పూజారులు ఆహ్వానించారు. సోమవారం కలెక్టరేట్‌లో వారు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. మరోవైపు చిల్పూరు శ్రీ బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో వచ్చే నెల 6 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించే వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు ఆలయ అధికారులు ఆహ్వానించారు. అనంతరం బ్రహ్మోత్సవాల ప్రచార వాల్ పోస్టర్‌ను కలెక్టర్ షేక్‌రిజ్వాన్ బాషా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవోలు గోపీరాం, వెంకన్న, డీపీవో స్వరూప, ఎస్సీడీడీ విక్రమ్, ఆలయ ఈవోలు మోహన్‌బాబు, లక్ష్మీప్రసన్న, అర్చకులు డీవీఆర్ శర్మ, సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

వైన్స్‌షాపులను తనిఖీ చేసిన ఎక్సైజ్ ఎస్సై

'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

వైన్స్ షాపులను తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ ఎస్సై పద్మ

పాలకుర్తి, ఫిబ్రవరి 24: వైన్స్ షాపుల యజమానులు సిండికేట్ అయి మద్యం కొరత సృష్టించి బెల్ట్ షాపులకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ ఎస్సై పద్మ హెచ్చరించారు. దీనికి కారణమైన షాపుల యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. 'మద్యం షాపుల సిండికేట్' అనే శీర్షికన మంగళవారం 'నమస్తే తెలంగాణలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎక్సైజ్ అధికారులు సీఐ బీ సంతోష్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎస్సై పద్మ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నాలుగు మద్యం షాపులను తనిఖీ చేశామన్నారు. వినియోగదారులకు ఐబీ క్వాటర్లు, కేఎఫ్ లైట్ బీర్లు, ఫుల్‌బాటిల్స్ అమ్మాలని సూచించారు. వైన్స్ షాపుల్లోనే మద్యం విక్రయాలు జరగాలని హెచ్చరించారు. లేని పక్షంలో కేసులు నమోదు చేసి సీజ్ చేస్తామని హెచ్చరించారు.

నేటి నుంచి కొమురవెల్లికి ప్రత్యేక బస్సులు

జనగామ, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ) : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు ప్రతి 15 నిమిషాలకు ఒక ప్రత్యేక బస్సు నడుపనున్నట్లు ఆర్టీసీ జనగామ డిపో మేనేజర్ ఎస్ స్వాతి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 25న మంగళవారం 5 బస్సులు 25 ట్రిప్పులు, ఈనెల 26న 40 బస్సులు 200 ట్రిప్పులు, 27న 40 బస్సులు 200 ట్రిప్పుల చొప్పున ప్రతి పావుగంటకు ఒక బస్సు జనగామ నుంచి కొమురవెల్లి జాతరకు బయలుదేరుతుందని ఆమె తెలిపారు. పెద్దలకు రూ.100, పిల్లలకి రూ.50 చొప్పున టికెట్ చార్జీగా నిర్ణయించామని పేర్కొన్నారు. మహా శివరాత్రికి పాలకుర్తికి వెళ్లే భక్తుల కోసం కూడా బస్సులు అందుబాటులో ఉంచామని తెలిపారు. ప్రయాణికులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని, రద్దీని బట్టి అవసరమైతే అదనపు సర్వీసులు నడుపుతామని ఆమె వెల్లడించారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందిస్తున్న దాతలు

టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

జఫర్‌గఢ్, ఫిబ్రవరి 24 : మండలంలోని ఉప్పుగల్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు హోప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ హైదరాబాద్ సంస్థ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రి అందించారు. సోమవారం సంస్థ వ్యవస్థాపకులు హిమజారెడ్డి ఆర్థిక సాయంతో సంస్థ ప్రతినిధి పల్లె రాజిరెడ్డి 33 మంది విద్యార్థులకు వీటిని అందించారు. రాజిరెడ్డి మాట్లాడుతూ వార్షిక పరీక్షల కోసం రైటింగ్ ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిల్, ఏరేజర్, షార్పనర్, తదితర మెటీరియల్‌ను విద్యార్థులకు అందించామన్నారు. హెచ్‌ఎం పరహత్ కౌసర్ మాట్లాడుతూ హోప్ ఫర్ లైఫ్ ఫౌడేషన్ సంస్థ ప్రతినిధులు పరీక్ష మెటీరియల్ అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి గాదెపాక భాస్కర్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటపతి, రాజేందర్, కిరణ్‌కుమార్, రాధ లక్ష్మి, సరిత, దేవిక, దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు భద్రత

బచ్చన్నపేట ఫిబ్రవరి 24: మహాశివరాత్రి బహ్మోత్సవాల్లో భాగంగా శివ కల్యాణం సందర్భంగా అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, ఏఎస్పీ పండరి చేతన్ నితిన్ తెలిపారు. మండలంలోని కొడవటూర్ సిద్ధేశ్వరస్వామి ఆలయంలో జరిగే మహాశివరాత్రి కల్యాణ భద్రత ఏర్పాట్లను సోమవారం సాయంత్రం అధికారులతో కలిసి పరిశీలించారు. వారు మాట్లాడుతూ గతంలో కంటే ఎక్కువ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో అం దరూ స్వామివారిని దర్శించుకునేలా ఏర్పాట్లుండాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీపీవో స్వరూప, జనగామ ఆర్డీవో గోపిరామ్, తహసీల్దార్ ప్రకాశ్‌రావు, నర్మెట సీఐ అబ్బయ్య, ఎస్సై హమీద్, ఎంపీడీవో వెంకటమల్లికార్జున్, ఆలయ నిర్వాహణాధికారి చిందం వంశీ, ఆలయ కమిటీ చైర్మన్ ఆముదాల మల్లారెడ్డి, ఆలయ ప్రధాన పూజారి ఓంనమఃశివాయ, మాజీ సర్పంచి గంగం సతీశ్రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రూపచైతన్య పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

చిల్పూరు, ఫిబ్రవరి 24 : మండలంలోని పల్లగుట్టకు చెందిన గౌడుగు ఎల్లయ్య (68) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న బుగులు వేంకటేశ్వరస్వామి దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు గౌడ్, మార్కెట్ డైరెక్టర్ పేరాల సుధాకర్, చిల్పూరు దేవస్థాన డైరెక్టర్ ఎనగందుల రత్నాకర్ రెడ్డి, నాయకులు ధార రాజు, బొట్టు చేరాలు, జీడి రమేష్, పిట్టల ఎల్లయ్య, రామరాజు, బత్తిని రాజు, అశోక్ పాల్, రాజు, మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

28 వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 24 : ఆర్థిక అక్షరాస్యత, మహిళా సాధికారతపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సూచనల మేరకు ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించే వారోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల ప్రచార వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ మహిళల ఆర్థిక ప్రణాళిక, పొదుపు నష్ట నివారణ చర్యలు, ఆర్థిక పరిపుష్టి రుణాలు, గృహ రుణాలపై అవగాహన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో వసంత, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీధర్, సీఎఫ్‌సీఎల్ కౌన్సిలర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

రఘునాథపల్లి, ఫిబ్రవరి 24: రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీలో పనిచేస్తున్న ప్రైవేట్ డ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలోని ఖిలాషాపురం–రామరాయిని బంగ్లా మధ్యలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పతేషాపురానికి చెందిన గద్దం మహేందర్ (32) ఆర్టీసీలో హైర్ బస్ డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. మండలంలోని మేకలగట్టులో జరిగిన బంధువుల పెండ్లి వేడుకలకు ఆదివారం వెళ్లాడు. సోమవారం తెల్లవారుజామున స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా ఖిలాషాపురం సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద బైక్ అధుపుతప్పి పడిపోయాడు. దీంతో తీవ్రంగా గాయపడిన మహేందర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనాస్థలిని స్థానిక ఎస్సై దూదిమెట్ల నరేశ్‌యాదవ్ పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మోర్ సూపర్ మార్కెట్‌కు రూ.20 వేలు జరిమానా

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 24 : జిల్లా కేంద్రంలోని సిద్దిపేట రోడ్డు మార్గంలో ఉన్న మోర్ సూపర్ మార్కెట్‌ను సోమవారం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సీజ్ చేసి రూ.20 వేల జరిమానా విధించారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వినిల్ తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ పట్టణానికి చెందిన ఉపేందర్ నెల క్రితం మోర్ సూపర్ మార్కెట్‌లో చిన్న పిల్లలకు పోషకాహారంగా తినిపించే 750 గ్రాముల బరువు కలిగిన డ్రై ఫ్రూట్స్ ప్యాకెట్‌ను రూ.460కు కొనుగోలు చేశాడు. ఇంట్లో నిల్వ ఉంచిన ఆ ప్యాకెట్‌లో 650 గ్రాములు వినియోగించగా, ప్రస్తుతం మిగిలిన 100 గ్రాముల బరువున్న డ్రై ఫ్రూట్స్‌లో తెల్లటి పురుగులు కనిపించాయి. దీంతో సదరు వినియోగదారుడు సోమవారం మోర్ సూపర్ మార్కెట్ సిబ్బందిని ప్రశ్నించాడు. దీనిపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వినిల్ సూపర్ మార్కెట్‌ను తనిఖీ చేశారు. డ్రై ఫ్రూట్స్ శాంపిల్ ప్యాకెట్‌ను టెస్ట్ కోసం హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించారు. సూపర్ మార్కెట్‌ను తాత్కాలికంగా సీజ్ చేసి రూ.20 జరిమానా విధించినట్లు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.